క్లుప్తంగా

ఐరాల ఎస్‌ఐగా నరసింహులు



ఐరాల: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆళ్లగడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఐరాల ఎస్‌ఐగా వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్ బాబు చిత్తూరు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నిబధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దీనికి ఎమ్మెల్యే అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. వివిధ ప్రముఖ కంపెనీలో ఉద్యోగ మేళాలో పాల్గొంటున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రైల్వేస్టేషన్‌లో గస్తీ పర్యవేక్షణ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న రైల్వే డీఎస్పీ హర్షిత

చిత్తూరు కార్పొరేషన్: భారత్ బంద్ నేపథ్యంలో చిత్తూరు రైల్వేస్టేషన్‌లో గస్తీని తిరుపతి రైల్వే డీఎస్పీ హర్షిత బుధవారం పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమానితులు ఉంటే విచారించి, సందేహం వస్తే అదుపులో తీసుకోవాలని సూచించారు. రైల్వేస్టేషన్‌లో నిర్వహిస్తున్న గస్తీ అంశాలపై చర్చించారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషా దినోత్సవం నిర్వహించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న తులసీనాథంనాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈఓ దేవరాజులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు తెలియజేసేలా తెలుగుభాషా దినోత్సవం వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ వేడుకల నిర్వహణ తప్పనిసరిగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. చుక్కావారిపల్లె గ్రామంలో బుధవారం ఆమె పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలను ప్రతి ఒక్కరూ పశువుకు వేయించుకోవాలన్నారు. ఈ టీకాలు వేయకపోతే పశువులు వివిధ వ్యాధులకు గురికావచ్చని చెప్పారు. గుడిపాలలో 17వేల వరకు పాడి ఆవులు, ఎద్దులు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 31 వరకు గ్రామాల్లో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్స్‌కు దరఖాస్తులు

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మ్యాథమేటిక్స్, బోటనీ సబ్జెక్టులు బోధించడానికి గెస్ట్ లెక్చరర్స్ కావాలని ప్రిన్సిపల్ ఎ.రఘుపతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పీజీ అర్హత కలిగి కనీసం 50 శాతంతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రిన్సిపల్‌ను నేరుగా సంప్రదించాలని కోరారు. మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ అడ్మిషన్లు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద తెలిపారు. ఆమె మాట్లాడుతూ బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బాటనీ కోర్సుల్లో చేరేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు.

ఫ్యూజులు ఎగిరిపోతాయ్!



వర్షాకాలం.. చెట్ల మధ్య నుంచే వెళ్లే విద్యుత్ తీగలు మరింత ప్రమాదకరం. తేమ తగలగానే చెట్ల ఆకుల నుంచి విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరాలో ఉన్న లోటుపాట్లతోపాటు తేమగా ఉన్నప్పుడు విద్యుత్ మోటార్లకు ఫ్యూజులు ఎగిరిపోతుంటాయి. వాటిని యజమానులే స్వయంగా సరిచేసే క్రమంలో ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు అంతగా కనిపించవు. కానీ చాలా చేటు చేస్తాయి. పొలంలో ఎక్కడ అడుగు పెట్టినా ప్రాణం తీసేస్తాయి. వీటితో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ స్విచ్ ఆన్ చేసేటప్పుడు కూడా కాళ్లకు రబ్బరు చెప్పులు వేసుకుని, చేతికి తేమ లేకుండా చూసుకోవడం ఉత్తమం.

- వర్షాకాలం జాగ్రత్తలు తప్పనిసరి
- విద్యుదాఘాతాలపై అప్రమత్తత అవసరం
- కొద్దిపాటి నిర్లక్ష్యం.. ప్రాణాలకే ప్రమాదం

ఐరాల: వర్షాకాలం వచ్చేసింది. విద్యుత్ ప్రమాదాలకు అత్యధికంగా ఆస్కారముండే కాలమిది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండడం తప్పనిసరి. వర్షాకాలంలో మరింత జాగ్రత్తగా మెలగడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని విద్యుత్ నిపుణులు పేర్కొంటున్నారు. విద్యుదాఘాతాలు వర్షాకాలంలోనే ఎక్కువ. వేసవిలో వేగంగా గాలి రావడం వల్ల విద్యుత్ వైర్లు తెగి ఉండడం, బాగా కిందకు వేలాడడం వంటివి చోటుచేసుకుంటాయి. ఇళ్ల వద్ద దుస్తులు ఆరేసుకోవడానికి ఉపయోగించే ఇనుప తీగలు సర్వీసు వైర్లకు ఆనుకొని ఉండి ప్లాస్టిక్ కవచాన్ని కట్ చేసి లోపలి భాగంలో ఉన్న విద్యుత్, ఆ తీగ ద్వారా ప్రసరించే అవకాశముంటుంది. ఆరుబయట ఉన్న స్విచ్‌లు వేయడం వల్ల విద్యుదాఘాతానికి గురయ్యే ఆస్కారముంది. వీటన్నింటితో పాటు వర్షాకాలంలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి ఉంటాయి. వాటిని గమనించకుండా కొమ్మలు నరకడానికి చెట్లు ఎక్కడం వల్ల సైతం విద్యుదాఘాతానికి గురయ్యే పరిస్థితి ఉంటుంది.

35 అడుగుల దూరంలో ఉండాలి

వర్షాకాలంలో వచ్చే ఈదురుగాలులు, పెనుగాలులకు ఊరిబయట పొలాల్లో ఉండే విద్యుత్ తీగలు తెగిపడతాయి. వాటిని పునరుద్ధరించకపోతే వాటివల్ల ప్రమాదాలకు ఆస్కారముంటుంది. పొలాల్లో స్టార్టర్ వద్ద నుంచి బోరు వరకుండే వైర్లను నేలపైన ఉంచుతారు. దీనివల్ల వైర్లు నేల రాపిడికి గురై పైన ఉండే ఇన్సులేషన్ పోతుంది. వర్షం వచ్చే సమయంలో ఇనుప విద్యుత్ స్తంభాలను అసలు పట్టుకోకూడదు. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు వర్షాకాలంలో కనీసం 35 అడుగుల దూరంలో ఉండాలి.



అవగాహన లేకుండా ఫ్యూజ్ వేయొద్దు

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్‌లు పోతే లైన్‌మన్ గానీ, అసిస్టెంట్ లైన్‌మన్ గానీ వచ్చే వరకు రైతులు వేచిచూడరు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌ను పిలవడమో, లేక తామే ఫ్యూజ్ వేయడమో చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలా చేయకుండా కచ్చితంగా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందజేయాలి. ఇంటి వద్ద ఉండే విద్యుత్ మీటర్ల వద్ద గానీ, వ్యవసాయ భూముల్లోని స్టార్టర్ బాక్సుల వద్ద గానీ ఎర్త్ వైర్లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. విద్యుత్ తీగలు తెగి బాక్సు పైన పడినా, వర్షం వల్ల బాక్సులు, వైర్లు తడిచినా భూమికి కరెంటు చేరి ఫ్యూజు పోగొట్టి జరిగే ప్రమాదాన్ని ఎర్త్ వైరు కాపాడుతుంది. కాబట్టి ఎర్త్ వైర్లను సరి చూసుకోవడం తప్పనిసరి.



ప్లాస్టిక్ బాక్సులు ఉపయోగించాలి

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించి గతంలో రైతులు స్టార్టర్ బాక్సుకు ఇనుప బాక్సులు ఉపయోగించేవారు. విద్యుత్ తీగలు తెగి అవి ఇనుప బాక్సుకు ఆనుకుంటాయి. దీంతో బాక్సును అంటుకోగానే రైతులు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు అందుబాటులోకి వస్తున్న ప్లాస్టిక్ బాక్సులను వాటి స్థానంలో ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా ప్రమాదాలకు అవకాశముండదు.



చెట్ల కొమ్మల మధ్యలో ఉన్న విద్యుత్ తీగలు

> **రబ్బరు గ్లౌజులు వాడడం మేలు**
>
> ప్రజలు వర్షాకాలంలో మరిన్ని జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. అన్నింటి కంటే ప్రాణాలు విలువైనందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి. ఎర్త్‌లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. విద్యుత్ ఉపకరణాలను తాకేటప్పుడు రబ్బరు గ్లౌజులు వాడటం మేలు.
>
> – చలపతి, ఏఈ, ఐరాల

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే ఉచిత వైద్యం





ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, తవణంపల్లె: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అందరికీ మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కోనగుంటలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు ఉన్నచోట దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యం అందించనున్నట్లు వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని నల్లపరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పరిసరాల శుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. వర్షాకాలంలో దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గర్భిణులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని పేయనపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 65 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది రెజ్వాన, అన్నపూర్ణ, శిరీష, శివగామి, శశి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ హరిప్రసాద్‌రెడ్డి

తవణంపల్లె: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. రిసోర్స్ పర్సన్లు హరిప్రసాద్‌రెడ్డి, దుర్గాప్రసాద్ గ్రామ పంచాయతీల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నూతన ప్రణాళిక తయారుచేయడం పంచాయతీ సర్పంచుల విధులు, అధికారాలు, చట్టాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, ఇంధన పొదుపు, జీపీడీపీలో ఉన్న లోపాలను సవరించి చక్కటి ప్లాన్ తయారుచేయడం తదితర విషయాలపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

గుడిపాల: మండలంలోని లబ్ధిదారులకు రేషన్ సరుకులను సకాలంలో అందజేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 16వ తేదీ వరకు లబ్ధిదారులు ఎప్పుడు వచ్చినా డీలర్లు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను అందజేయాలన్నారు. కొన్ని రేషన్ షాపుల్లో ఆన్‌లైన్‌లో బియ్యం ఉంటే షాపుల్లో బియ్యం లేదని వీటన్నింటిని సరిచేసుకోవాలని డీలర్లకు సూచించారు. కొంతమంది డీలర్లు గోడౌన్‌లో నుంచే బియ్యం తూకాలు తక్కువ వస్తున్నాయని ఆయనకు తెలియజేశారు. వారితో మాట్లాడి వాటిని సరిచేస్తామన్నారు. ఎక్కడా గానీ అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ డివిజన్ ట్రాన్స్‌కో ఉద్యోగుల సంఘం 1104 కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ట్రాన్స్‌కో అతిథి గృహంలో బుధవారం వివరాలను సంఘం డిస్కం కార్యదర్శి దేవేంద్రరెడ్డి ప్రకటించారు. డివిజన్ అధ్యక్షుడిగా శ్రీరాములు, కార్యదర్శిగా గోవిందన్, వర్కింగ్ ప్రెసిడెంటుగా మధు, సంయుక్త కార్యదర్శి మురగేసు, కోశాధికారిగా సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏకాంబరం, సలహాదారుడిగా సుబ్రమణ్యంతో పాటు మొత్తం 27 మందితో కార్యవర్గం ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు రెండేళ్ల పాటు పదవికాలంలో ఉంటారన్నారు. నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు గోపి, వర్కింగ్ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు గోవిందరాజులు, సురేష్, చిట్టిబాబు నాయుడు, పద్మనాభనాయుడు, అరుణ్, సత్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నగర కమిటీ ఎన్నిక



నగర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రేఖ

చిత్తూరు కలెక్టరేట్ : పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నగర కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం నగరంలోని గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ నగర శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు నగర ప్రధాన కార్యదర్శిగా కే.బీ.రేఖ (గాండ్లపల్లి పాఠశాల, చిత్తూరు), మహిళా విభాగం కార్యదర్శిగా అనూష (గాండ్లపల్లి పాఠశాల, చిత్తూరు) సహ కార్యదర్శిగా శారద (గిరింపేట నగరపాలక పాఠశాలలో) విధులు నిర్వర్తిస్తున్న వారిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల తరపున కట్టమంచి నగర పాలక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న యువరాజ్, వన్నియర్ బ్లాక్‌లో పనిచేస్తున్న ఆనంద్‌ను జాయింట్ సెక్రటరీ ఎన్నుకున్నట్లు చెప్పారు. గిరింపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉష, బాలాజీ నగర్‌లో పనిచేస్తున్న సుధీర్, యుగంధర్, ఐజీరెడ్డి పాఠశాలలో పనిచేస్తున్న నాగరాజును ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే ఫోన్ – 98499 07885కు ఫోన్‌చేసి తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. దీనికి చిత్తూరు కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులేకుండా చూడండి



సర్వేలో పాల్గొన్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

గుడిపాల: ఓటర్ల జాబితాలో తప్పుల తడకలు లేకుండా చూసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పేయనపల్లె, బసవాపల్లె పోలింగ్‌స్టేషన్‌లలో బుధవారం ఇంటింటా సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీఎల్‌ఓలతో మాట్లాడుతూ డోర్ నెంబర్‌లు, పేర్లు మార్పు వంటివి సరిదిద్దాలన్నారు. కుటుంబంలో అందరూ ఒకేచోట ఉండే విధంగా చూసుకోవాలన్నారు. చనిపోయిన వారు ఉన్నట్లయితే వారందరినీ తొలగించేందుకు వారి మరణధృవీకరణ పత్రాన్ని ఖచ్చితంగా జత చేయాలన్నారు. 2025 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన వారిని కొత్తగా ఓటు నమోదు చేయించుకోవాలని వారికి సూచించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



బంగారుపాళెంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు



ఆర్టీసీ టూ డిపో గేటు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో బుధవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత యువత ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దళిత నాయకులు, యువకులు నల్లబ్యాడ్జీలు ధరించి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ వద్దు– దళితులను విడగొట్టవద్దు అంటూ నినాదాలు చేశారు. దళిత నాయకులు వాసు, సుబ్రమణ్యం, నవీన్, జగదీష్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణతో మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని కోరారు. అన్నదమ్ములుగా కలసి ఉన్న వారిని ఎస్సీ వర్గీకరణ పేరుతో వేరు చేయడం సమంజసం కాదన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత యువత పాల్గొన్నారు.

బంద్ పాక్షికం

తవణంపల్లె: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను నిరసిస్తూ నిర్వహించిన బంద్ పాక్షికంగా సాగింది. బీఎస్పీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. మండలంలో బంద్ ప్రకటించినప్పటికీ రవాణా యథావిధిగా కొనసాగింది.

ఎస్సీ వర్గీకరణ సరికాదు

కాణిపాకం: ఎస్సీ ఎస్టీ వర్గీకరణ సరికాదని జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండిపడింది. వర్గీకరణకు నిరసనగా నగరంలో బుధవారం భారత్ బంద్ చేపట్టారు. ఆర్టీసీ టూ డిపో గేటు ఎదుట ధర్నా చేపట్టారు. బస్సును రానివ్వకుండా గేటు వద్దే అడ్డుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ సమంజసం కాదని నినదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాబర్ట్, బాబు, రాజాబాబు, సుబ్రమణ్యం, బుల్లెట్ బాబు, ఏసు, రవికుమార్ పాల్గొన్నారు.